సాక్షి చిత్తూరు

గురువారం । 4 । జనవరి । 2024



కొలమాసనపల్లెలో బైక్ ర్యాలీ

కొలమాసనపల్లె పంచాయతీ వాసులతో కలిసి కల్లాడు సచివాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. - 8లో



సేవకులుగా పనిచేద్దాం

వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సేవకుల్లా పనిచేద్దామని ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



టీడీపీ వర్గీయుల దాడి

వీధిలో కట్టిన తోరణాల విషయమై టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. - 8లో

కొత్తగా మురిపింఛన్

- పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా
- అవ్వాతాతలపై అభిమానానికి పింఛన్ పెంపే నిదర్శనం

నగరి : మబ్బుల కారణంగా సూర్యుడైనా ఆలస్యంగా వస్తాడేమో కానీ, అంతకంటే ముందుగానే జగనన్న పంపిన పింఛన్ మీ ఇంటి తలుపు తడుతోందని, ఈ నెలలో కొత్తగా మరింత పెంపుతో లబ్ధిదా రులు మురిసిపోతున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. పింఛన్ మొత్తం పెంచి రూ.3 వేలకు పెంచిన సందర్భంగా నగరి బస్టాండ్ ప్రాంగణం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవ రణలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ జగనన్న మాటిస్తే దానికి తిరుగులేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తం పెంచి, మాట తప్పడు..మడమ తిప్పడు అని మరోసారి ఆయన నిరూపించుకున్నారన్నారు. జగనన్నకు అవ్వాతాతలపై ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమన్నారు. మహానేత వైఎస్సార్ పాలనలోనే అర్హులందరికీ వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛన్ల పంపిణీ ప్రా రంభమైందన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హుల్లో సగం మందికి పింఛన్ తీసివేశారని విమర్శించారు. ఏ సీఎం చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి అవినీతి లేకుండా పేదలకు పింఛన్ ఇస్తున్నారన్నారు. చంద్రబాబు 39 లక్షల మందికి రూ.వెయ్యి మాత్రమే పింఛన్ ఇచ్చేవారని, అందుకు రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యేదని చెప్పారు. జగన న్న ఇచ్చిన హామీని చూసి ఎన్నికల ముందు మాత్రమే రూ.2 వేలు పింఛన్ అందించారన్నారు. జగనన్న సీఎం అయ్యాక 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లు పింఛన్‌గా అందిస్తున్నారన్నా రు. దేశంలో కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకు బీజేపీ నుంచి టీడీపీ వరకు, ఏపీ నుంచి యూపీ వరకు ఎంతో మంది నాయకులు పాలించారని, ఎవరూ రూ.3 వేలు పింఛన్ ఇవ్వలేదన్నారు.



నగరిలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి ర్యాలీగా వస్తున్న మంత్రి ఆర్కే రోజా

2,18,155 మందికి లబ్ధి

చిత్తూరు అగ్రికల్చర్: సామాజిక పింఛన్ల పంపిణీని ఆయా మండలాల వారీగా వారం రోజులపాటు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బుధవారం నగరి మున్సిపాలిటీ, రూరల్ మండలంలో మంత్రి రోజా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛను అందజేశారు. పలమనేరు, పెద్దపంజాణి, వి.కోట మండలాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ, శాంతిపురం మండలంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌ల ఆధ్వర్యంలో పెంచిన పింఛన్లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,76.008 మంది లబ్ధిదారులకు రూ.80.89 కోట్ల మేరకు పింఛన్ నగదును ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో కొత్తగా 3,739 మంది అర్హులకు ఈ నెల నుంచి పింఛన్లను అందించనున్నారు. ఇప్పటివరకు ప్రతి నెలా రూ. 2,750 చొప్పున పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులకు రూ.250 పెంచి ఒక్కొక్కరికి మొత్తం రూ.3 వేల చొప్పున అందించనున్నారు. ఈ ప్రక్రియతో జిల్లావ్యాప్తంగా మొత్తం 2,18,155 మందికి లబ్ధి చేకూరనుంది.

పెన్షన్ పెంపు.. మానవత్వానికి ప్రతిరూపం

- కలెక్టరేట్‌లో ఘనంగా పింఛన్ల పెంపు జిల్లాస్థాయి కార్యక్రమం
- పాల్గొన్న నగర మేయర్ అముద, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : విశ్వసనీయతకు అర్థం చెబుతూ, మానవత్వానికి ప్రతిరూపంగా పింఛన్ల పెంపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర మేయర్ అముద అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వర్చువల్ పద్ధతిలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం పింఛన్‌ల పెంపు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అముద మాట్లాడుతూ టీడీపీ పాలనలో పింఛన్‌ల కోసం అవ్వాతాతలు మండల కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఇంటి వద్దకే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లను వలంటీర్లు తలుపు తట్టి అందజేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌లను పెంచిందన్నారు. రూ.2,750 నుంచి ఇకపై రూ.3 వేలు పింఛన్‌ను ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తుందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జనవరి 2024 నుంచి 2,76,008 మందికి రూ.3 వేల చొప్పున పింఛన్ అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. పెంచిన పింఛన్ ప్రకారం జిల్లాలోని లబ్ధిదారులకు రూ.80.90 కోట్లను ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఈ జనవరిలో 3,937 మందికి నూతన పింఛన్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, పలువురు అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

మాటలు రావడం లేదు



ఎందరినో చూశాం. అది చేస్తాం.. ఇది చేస్తామని మాటలు చెప్పిన నాయకులు చాలా మందిని చూశాం. మొట్టమొదటి సారి చెప్పిన మాట ప్రకారం పేదలకు సాయం చేస్తున్న ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నాం. వృద్ధాప్యంలో కష్టం తెలియకుండా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఎన్ని జన్మలెత్తినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. జగన్ సీఎం కావడం మాలాంటి వారికి వరం.

– భాగ్యమ్మ, మర్కిమానువీధి, కుప్పం

న్యూస్‌రీల్

సురక్షతో ఆరోగ్యరక్ష



హెల్త్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్యరక్ష చేకూరుతుందని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరం టెలిఫోన్‌కాలనీ, ఎల్‌బీ పురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెల్త్ క్యాంపు నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఇంటికీ సంపూర్ణ వైద్యం ఉచితంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్పొరేట్ తరహాలో వైద్యం అందిస్తోందన్నారు.

అంతర్జాతీయ ఉద్యోగ కల్పనకు శిక్షణ

చిత్తూరు అగ్రికల్చర్: బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన గ్రామీణ యువతీ, యువకులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ తులసి తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో విజయవాడలోని స్కిల్ కాలేజీలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 19– 35 ఏళ్లలోపు వయస్సున్న యువతీ,యువకులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాష తరగతులను నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లను తీసుకుని ఈ నెల 4,5 తేదీల్లో చిత్తూరులోని కలెక్టరేట్ సమీపంలోని టీటీడీసీ శిక్షణ కేంద్రంలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 93905 04650, 93905 04626 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య సురక్షకు 1,039 ఓపీలు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగింది. మొత్తం నాలుగు చోట్ల హెల్త్ క్యాంపులు నిర్వహించగా 1,039 ఓపీలు వచ్చాయి. నలుగురు పీహెచ్‌సీ డాక్టర్లు, 10 మంది ప్రత్యేక వైద్యనిపుణులు క్యాంపులో పాల్గొని, రోగులకు పరీక్షలు చేశారు. జనరల్ ఓపీకి 424, గైనిక్ 158, చిన్న పిల్లలు 62, ఆర్థో 163, డెంటల్ 5, చర్మం 39, కంటి సమస్యలకు 188 మంది వచ్చారు. కంటి వెలుగుకు కింద 32 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని జెడ్పీ నూతన సమావేశ మందిరంలో ఈ నెల 6వ తేదీన జరగాల్సిన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడిందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వరసిద్ధునికి రూ.2లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి దాతలు రూ.2 లక్షలు విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన షణ్ముఖ కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి నిత్యాన్నదానానికి రూ.1.5 లక్షలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలు విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తీసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాపీ, తవ్వకం, సెంట్రింగ్, ప్లంబింగ్, క్వారీ, వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు వీటిని పొందవచ్చన్నారు. ఐదేళ్లకొకసారి రూ.110 ఫీజు చెల్లించి, కార్మికశాఖ కార్యాలయంలో కార్డు పొందాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం వచ్చిన వారికి వైఎస్సా ర్ బీమా కింద రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షల వరకు పొందవచ్చన్నారు. అలాగే సహజ మరణానికి రూ.60 వేలు, ప్రసూతి సాయం కింద రూ.20 వేలు, ఆస్పత్రి ఖర్చు కింద రూ.3 వేలు, దహనసంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వివాహ కానుక కింద రూ.40 వేలు ఇస్తారన్నారు. సచివాలయం, కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్షీరాభిషేకం



పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా వి.కోటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ , పింఛన్ల లబ్ధిదారులు -వి.కోట

జగన్‌కు రుణపడి ఉన్నాం




వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇవ్వడం ప్రపంచ చరిత్రలో ఇదే ప్రథమం. 60 ఏళ్లుగా ఎంత మందో ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలను చూశాం. కానీ ప్రజల కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న సర్కారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అవస్థలు పడ్డాం.. కానీ నేడు ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యం. – జీవరత్నం, జేపీ రోడ్డు, కుప్పం

పింఛన్ పంపిణీ



శాంతిపురం మండల కేంద్రంలోని సచివాలయ ఆవరణలో పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్లను చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. -శాంతిపురం

ఇంటి వద్దనే పింఛన్



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ నగదు అందజేస్తున్నారు. గతంలో పింఛన్ పొందాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది. మండల కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లం. ఈ నెల నుంచి రూ.3 వేలు పింఛన్ అందుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచి, మాకు అందజేస్తున్న సీఎం జగన్ రుణం ఎన్నటికీ మరువలేం. – జి.సుగుణ, ప్రశాంత్‌నగర్, లబ్ధిదారు, చిత్తూరు

ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మాకు అందజేసే పింఛన్ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచి, అందజేస్తోంది. రూ.3 వేలు పింఛన్‌ను గతంలో ఎవరూ ఇవ్వలేదు. నా భర్త 2019 సంవత్సరంలో మృతి చెందారు. అప్పట్లో వలంటీర్ మా ఇంటి వద్ద కు వచ్చి వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయించా రు. రూ.2,250 పింఛన్ నుంచి ప్రస్తుతం రూ.3 వేలు అందుకుంటున్నాను. ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న పింఛన్ నా కెంతగానో ఉపయోగపడుతోంది. – ఏ.ఉషారాణి, 17 వ వార్డు, మసీదు మిట్ట, చిత్తూరు

దివ్యాంగుల కోటాలో పింఛన్ తీసుకుంటున్నా



దివ్యాంగుల కోటాలో పింఛన్ కోసం గత ప్రభుత్వంలో చాలా సార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగాను. నాకు అ ర్హత ఉన్నప్పటికీ ఎవరూ ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి దరఖాస్తు, అవసరమైన సర్టిఫికెట్లను తీసుకెళ్లి, మంజూరు చేయించారు. నాకు కాళ్లు, చేతులు పనిచేయవు. నేను ఎవరి దగ్గరికీ వెళ్లకుండానే నాకు దివ్యాంగుల పింఛన్ మంజూరైంది. నాకు ప్రస్తుతం పింఛన్ వస్తోందంటే అది సీఎం వల్లే. నాలాంటి దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందజేస్తున్న సీఎం రుణం మరువలేనిది. – ముత్తు, లబ్ధిదారుడు, గంగాసాగరం, చిత్తూరు

జగన్ మాకు దేవుడు



జగన్ మాకు పెద్ద కొడుకు అనుకున్నాం.. కాదు ఆయన దేవుడు. ఎన్నికల సమయంలో వృద్ధులకు పింఛన్ పెంచి ఇస్తామని మాట ఇచ్చారు. ఎన్నికల తరువాత ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచుతూ వచ్చారు. ఈ నెలలో రూ.3 వేలు ఇస్తామని చెప్పారు.. ఇచ్చారు. ఇక మాకు ఎవరి సహాయ సహకారాలు అవసరం లేదు. ఈ డబ్బుతో మా అవసరాలు అన్ని తీరిపోయి ఇంకా మిగులుతోంది. జగన్ ఎవరు... మా పెద్దాయన రాజన్న బిడ్డ.. ఇచ్చిన మాట తప్పరు ఆయన మా ఆయుషు పోసుకుని వేయ్యేళ్లు బతకాలి స్వామి. –వల్లెమ్మ, అమ్మేపల్లె, పూతలపట్టు మండలం

అర్జీ ఇచ్చిన వెంటనే పింఛన్ మంజూరు



నా పేరు జయమ్మ, మా ఊరు పూతలపట్టు గ్రామం. నాకు 60 ఏళ్లు. పింఛన్ కోసం అర్జీ ఇవ్వాలని పొరిగింట్లోని వృద్ధులతో చెప్పాను. పింఛన్ కోసం అర్జీ ఇవ్వ వెంటనే వస్తుందని వారు చెప్పారు. వెంటనే పింఛన్ కోసం వలంటీర్ వద్ద అర్జీ ఇచ్చాను. కొద్దిరోజులకే మీకు మంజూరైందని వలంటీర్ వచ్చి చెప్పగానే ఆశ్చర్యం వేసింది. అర్జీ ఇచ్చిన వెంటనే ఎవరూ సిఫార్సు చేయకనే పింఛన్ రావడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. నిజంగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. –జయమ్మ, లబ్ధిదారు, పూతలపట్టు

22న ఓటర్ల తుదిజాబితా



మాట్లాడుతున్న డీఆర్వో రాజశేఖర్.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్ల తుదిజాబితా ఈ నెల 22న ప్రచురించనున్నట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన అభ్యంతరాలను పకడ్బందీగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అన్ని నియోజకవర్గాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు మార్పులు, చేర్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, లోకేశ్, పరదేశి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిత్యావసరాల పంపిణీ



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలు శాఖల అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎండీయూ వాహనాలతో నిత్యావసర వస్తువులను ప్రజలకు పకడ్బందీగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ రైట్స్ వివరాలు త్వరితగతిన సేకరించాలన్నారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన వస్తువులు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ వాహనాలతో ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పంపిణీ వివరాలు తప్పనిసరిగా వలంటీర్ స్థాయిలో అప్‌డేట్ చేయడంతో పాటు ఫొటోలు పంపాలని చెప్పారు. ఎన్నికల కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఎన్నికల కసరత్తులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని చెప్పారు. అధికారులు అడిగే నివేదికలను ఎప్పటికప్పుడు పంపాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రీ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ వర్గీయుల దాడి

● వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలు



దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వీధిలో కట్టిన తోరణాల విషయమై ఇరువర్గాల మధ్య గొడవ తలెత్తింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయుల దాడి చేశారు. ఈ సంఘటనలో ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి పలమనేరు మండలంలోని టి.వడ్డూరులో చోటు చేసుకుంది. టీడీపీ మాజీ మంత్రి అమరనాథరెడ్డి పర్యటన నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆ పార్టీ కార్యకర్తలు వీధుల్లో టీడీపీ తోరణాలను కడుతుంటే స్థానిక ప్రజలు ఇబ్బందిగా ఉందంటూ అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. దీనిపై ఆగ్రహించిన టీడీపీ నాయకుడు స్వతంత్రబాబు అనుచరులు వైఎస్సార్‌సీపీ నేత గణేష్ అనుచరులపై రాళ్లతో దాడి చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పట్టణంలోని ఆస్పత్రిలో పరామర్శించారు. జరిగిన సంఘటనపై పలమనేరు సీఐ చంద్రశేఖర్ విచారిస్తున్నారు.

కంటి చూపునిస్తే.. విశ్వం చూపినట్టే!





నగరి: కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి ఆర్కేరోజా, వైద్యశిబిరాన్ని జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- ఉచితంగా అత్యున్నత కంటి చికిత్సలు
- మంత్రి ఆర్కే రోజా

నగరి : 'మనిషికి చూపు ఎంత ప్రాధాన్యమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కంటి చూపు పోతే ప్రపంచం వారికి చీకటై పోతుంది. అలాంటిది వారికి కంటి చూపునిస్తే అంధకారం తొలిగి.. వారికి విశ్వాన్ని చూపినట్టే .' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం నగరిలోని తన కార్యాలయం వద్ద మెగా ఉచిత కంటివైద్య శిబిరం, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాశాఖ మంత్రి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని, అయితే దూరప్రాంతాలకు వెళ్లడానికి తోడు లేకనో, ఖర్చు భరించలేకనో పలువురు కంటి వ్యాధులున్నప్పటికీ చికిత్స చేసుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారికి నగరి నియోజకవర్గంలోనే అత్యున్నత వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రతిరోజూ 300 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఇలా 8 రోజుల పాటు కంటి పరీక్షలు చేస్తారని చెప్పారు. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి వారికి తగిన మందులు ఇస్తారని, వాటిని వైద్యుల సూచనల మేరకు వాడిన తరువాత వస్తే ఇక్కడే మొబైల్ సర్జికల్ యూనిట్‌లో ఆపరేషన్ చేసి, రెండు గంటల తరువాత ఇంటికి పంపుతారన్నారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని కంటి సమస్యలున్నవారు వినియోగించుకోవాలన్నారు. పేద ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పమే ఈ కార్యక్రమం చేపట్టడానికి కారణమని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిండుమనసుతో ఆశీర్వదిస్తే చాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు.

మంత్రి చొరవతోనే నగరిలో మెగా మెడికల్ క్యాంప్

శంకరనేత్రాలయ కంటి వైద్య శిబిరం నగరి పట్టణంలో బుధవారం రెండోసారి జరుపుతున్నామంటే అది మంత్రి చొరవతోనే అని శంకరనేత్రాలయ ప్రతినిధి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ క్యాంప్ కోసం మంత్రి ఆర్కే రోజా పట్టు వదలకుండా తమకు సుమారు వంద ఫోన్లు చేసి ఉంటారన్నారు. రూ.8.5 కోట్లతో సిద్ధం చేసిన మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా దేశవ్యాప్తంగా తాము క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే ఇలాంటి వాహనం ఇండియాలో మాత్రమే ఉందన్నారు. ఈ వాహనంతో నిర్వహించే క్యాంపునకు పలువురు పోటీపడుతున్నారని చెప్పారు. కంటికి సంబంధించిన 93 వ్యాధులకు ఈ వాహనంలో పరీక్ష చేస్తామన్నారు. కుట్లు, నొప్పిలేకుండా ఆపరేషన్ చేస్తామని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని, దానికి వందశాతం గ్యారంటీ ఇస్తామన్నారు. 11వేల సర్జరీలు చేసిన నైపుణ్యత గల వైద్యులు ఆపరేషన్ చేస్తారన్నారు. మీరున్న ప్రాంతానికే వచ్చి అక్కడే రూ.50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేసి కంటి చూపు ఇవ్వడం సాధారణమైన విషయం కాదన్నారు. ఇదంతా మంత్రి ఆర్కే రోజా చొరవతోనే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, నింద్ర ఎంపీపీ దీప, శంకరనేత్రాలయ జిల్లా ఇన్‌చార్జి అర్పిత తదితరులు పాల్గొన్నారు.

సేవకుల్లా పనిచేద్దాం



మాజీ మున్సిపల్ చైర్మన్, అనుచరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- మాజీ మున్సిపల్ చైర్మన్ సరళామేరి వైఎస్సార్ సీపీలో చేరిక

చిత్తూరు రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సేవకుల్లా పనిచేద్దామని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సరళామేరి బుధవారం వైఎస్సార్ పార్టీ కండువా కప్పుకున్నారు. చిత్తూరు నగరంలోని జానకారపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆమెతో పాటు భర్త పన్నీర్‌సెల్వం, అనుచరులు పార్టీలో చేరారు. విజయానందరెడ్డి వారికి కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విజయానందరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై, తనపై నమ్మకంతో సరళామేరి పార్టీలో చేరారన్నారు. ఆమె ఐదేళ్ల పదవీ కాలంలో అవినీతికి తావులేకుండా నాయకత్వాన్ని ద్విగిజయంగా పూర్తి చేశారన్నారు. పట్టణానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆమె జగనన్న పాలన నచ్చి.. మెచ్చి పార్టీలోకి రావడం చాలా సంతోషకరమన్నారు. అలాగే తనవంతుగా పార్టీ పటిష్టతకు పాటుపడుతానన్నారు. నగరాభివృద్ధికి సేవకుడిగా పని చేస్తానని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపునకు మనమంతా కలిసికట్టుగా సేవకులుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. తనపై ఉన్న నమ్మకాని వమ్ము చేయకుండా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీని బలపరచి...అత్యంత భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. సీఎంకు బహుమానంగా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. సరళామేరి మాట్లాడుతూ సీఎం బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సీఎం సేవలు, విజయానందరెడ్డి చేస్తున్న మంచిని గుర్తించి పార్టీలో చేరానన్నారు. కచ్చితంగా విజయానందరెడ్డి విజయానికి కృషి చేస్తానన్ని ఆమె హామీ ఇచ్చారు. తొలుత విజయానందరడ్డికి స్థానికులు ఘనంగా ఆహ్వానం పలికారు. గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబునాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్, సహదేవన్, కేపీ శ్రీధర్, కుమారస్వామి రెడ్డి, అన్బు, కృష్ణమూర్తి, తుమ్మింద కుమార్, త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.



మూడు తరాల సమస్యకు మోక్షం

- లక్కలపూడివాండ్ల గ్రామాన్ని సందర్శించిన అటవీశాఖ అధికారులు



లక్కలపూడి వాండ్ల గ్రామాన్ని సందర్శిస్తున్న అటవీశాఖాధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని లక్కలపూడివాండ్ల గ్రామానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. మూడు తరాలుగా ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి అటవీశాఖ చర్యలు తీసుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా కనీస వసతులు లేక అవస్థలు పడిన పేదలకు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో మహర్దశ కలగనుంది. మండలంలోని లక్కలూపూడి వాండ్ల గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 20 కుటుంబాలు పూరి పాకల్లో జీవనం సాగిస్తున్నాయి. గతంలో పక్కా గృహాల నిర్మాణం కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా పక్కా గృహాలు మంజూరు కాలేదు. వారు నివశిస్తున్న ప్రాంతం అటవీ శాఖ పరిధిలో ఉన్న కారణంగా వారి కల నెరవేరలేదు. అయితే ఇటీవల గ్రామంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి దృష్టికి వారు ఈ సమస్య తెచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అటవీ శాఖ అధికారులతో చర్చించి, న్యాయం చేస్తామని చెప్పారు. వెంటనే జిల్లా అటవీ శాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డితో మాట్లాడి పేదలకు న్యాయం చేయాలని వారి సమస్యను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో బుధవారం జిల్లా అటవీ శాఖాధికారి చైతన్యకుమార్ రెడ్డి, తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించారు. ఈ ప్రాంతాన్ని పరిశీలించి, 20 కుటుంబాలకు పక్కాగృహాల నిర్మాణానికి అవసమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆ గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామికి రుణపడి ఉంటామని, అటవీశాఖాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

శక్తిఅమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి



శక్తి అమ్మకు తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆంధ్ర రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

వేలూరు: వేలూరు శ్రీపురంలోని బంగారుగుడి, శ్రీనారాయణి పీఠం పీఠాధిపతి శక్తిఅమ్మ 48వ జన్మదినోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదాలను స్వామివారికి ఆయన అందించి ఆశీస్సులు పొందారు. అనంతరం మహాలక్ష్మి ఆలయంలో అభిషేకం ,మంగళహారతి కార్యక్రమాల్లో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

కొలమాసనపల్లెలో బైక్ ర్యాలీ



భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పలమనేరు : మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ వాసులతో కలిసి కల్లాడు సచివాలయం నుంచి వందలాది మోటారుబైక్‌లతో ఎమ్మెల్యే వెంకటేగౌడ ర్యాలీ నిర్వహించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. హామీలతో వంచిస్తున్న బాబు మళ్లీ ఇప్పుడు భవిష్యత్తు గ్యారెంటీ, గ్యాస్ ఫ్రీ, ఆర్టీసీ ప్రయాణం ఫ్రీ అంటూ మరోసారి జనాన్ని బుట్టలో వేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారని, ఆయనకు మరోసారి ప్రజలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, ఉపాధ్యక్షులు జె.అమరనాథ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, సర్పంచ్ గోవిందుస్వామి, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు సుభాష్ చంద్రబోస్, విశ్వనాథరెడ్డి, చెంగారెడ్డి, మనోజ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మునిరత్నం, ధనుంజయ, సంతోష్, మధు,రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పట్లో బాబును నమ్మి నేనూ మోసపోయా!

- నేనూ ఓ బాధితుడినే
- చంద్రబాబు మోసాన్ని జనానికి వివరించిన బోస్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

పలమనేరు: తాను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగానని, గత 2104 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి అమరనాథరెడ్డిపై పోటీ చేశానని, అప్పట్లో చంద్రబాబు మాట నమ్మి జనాన్ని మోసం చేసిన మాట నిజమేనని ఇటీవల టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన పలమనేరు నాయకుడు సుభాష్ చంద్రబోష్ చంద్రబాబు మోసాలను జనానికి వివరించారు. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్, మున్సిపాలిటీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి మారిన అమరనాథరెడ్డి కారణంగా టీడీపీ బాధ్యత తనపై పండిందన్నారు. దీంతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పార్టీని బలోపేతం చేశానన్నారు. ఆపై అమరనాథరెడ్డిపైనే టీడీపీ నుంచి పోటీ చేసి సల్ప తేడాతో ఓటమి చెందానని తెలిపారు. ఆపై వైఎస్సార్‌సీపీలో గెలిచిన అమరనాథ రెడ్డి మళ్లీ టీడీపీలోకి మంత్రి పదవి కోసం వచ్చి తనకు పార్టీలో సముచిత స్థానం లేకుండా చేశారన్నారు. తాను టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినపుడు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మాట మేరకు తప్పుడు హామీలను ఇచ్చి, జనాన్ని మోసం చేసిన మాట అక్షరాలా నిజమేనన్నారు. మహిళలను ఏమార్చేందుకు బ్యాంకుల్లోని బంగారాన్ని విడిపిస్తామని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని, మహిళలకు ఏటీఎం కార్డులిస్తామని మోసం చేసిందాంట్లో తాను భాగస్వామిగా మారినందుకు చింతిస్తున్నానని బాధ పడ్డారు. చంద్రబాబు మోసాలను చూసి ఓర్వలేక నిజాయితీ కలిగిన జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తాను, తన క్యాడర్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు అండ్‌కో ఇచ్చే తప్పుడు హామీలను జనం ఏమాత్రం నమ్మవద్దని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



దినకర్ (ఫైల్)

పుత్తూరు: స్థానిక ఆరేటమ్మ ఆలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. పుత్తూరు రూరల్ మండలం ఉత్తరపుకండ్రిగ దళితవాడకు చెందిన ఏ.దినకర్(17) ఆరేటమ్మ ఆలయం వద్ద నడచి వెళుతుండగా పుత్తూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో దినకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతుడు స్థానికంగా ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు.

బాలిక అదృశ్యం

పాలసముద్రం: మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక బుధవారం అదృశ్యమైందని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు..నరసింహాపురం గ్రామానికి చెందిన బాలిక తిరుమల రాజుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆమె రోజులాగే ఉదయం పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం 6 గంటలు దాటిన ఇంటి కి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. బాలిక తిరుమలరాజుపురం నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బాలికను ఆటోలో తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ విషయమై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన్నట్లు ఏఎస్‌ఐ రమణరావు తెలిపారు.